స్థాపితం : 1930

LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు

జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి







# జమీన్‌రైతు

సంపుటి : 78 సంచిక 12 23-3-2007 శుక్రవారం 16 పేజీలు విడి ప్రతి : రూ. 5/-

*బహిరంగ ఓటింగ్ వివాదం*

## ప్రభుత్వం మెడకు చుట్టుకొంటుందా?

శాసనమండలికి బహిరంగ ఓటింగ్ వివాదం ప్రభుత్వం మెడకు చుట్టుకునేట్లు కన్పిస్తున్నది. ముఠా కుమ్ములాటలతో ఎమ్మెల్యేలు పార్టీ అభ్యర్థులకు ద్రోహం చేయకుండా నివారించడానికి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన ప్రయత్నం వికటించి, తీవ్రమైన సమస్యగా పరిణమిస్తున్నది. ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు మధ్య స్పర్థగా మారుతున్నది. ఎమ్మెల్యేలు చెప్పిన మాట వినేటట్లు కన్పించకపోవడంతో, ఈ వ్యూహం అనుసరించారాయన. మీ మనుషులన్న వారందరి చేతా చూపించి ఓటు వేయించండి అని హుకుం జారీ చేశారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లాలకు వెళ్లిన మంత్రులు ఆ ఆదేశాన్ని తుచ తప్పకుండా ఆచరించాలని ఒత్తిడి చేశారు. పత్రికలు దానికి విస్తృత ప్రచారం కల్పించాయి. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం బ్యాలెట్ పత్రం మీద బహిరంగంగా ఓటు వేయడం నేరం. కానీ రాయలసీమ రాజకీయవాదులకు అది చాలా సాధారణ విషయం. బూత్‌లను స్వాధీనం చేసుకుని, ఓటర్లు లేకుండానే మొత్తం బ్యాలెట్ పత్రాల మీద తమ అనుచరుల చేత ముద్రలు గుద్దించడం; బూత్‌ల ఆక్రమణ వీలుకాని సందర్భాలలో పోలింగ్ ఏజంట్లుగా వున్న తమ అనుచరులకు చూపించి ఓటు చేయమని ఓటర్లను నిర్బంధించడం జరిగిపోతూ వుంటుంది. ఎందరు ఎన్నికల కమిషనర్లు ఎన్నిరకాల ప్రయత్నాలు చేసినా ఆ దౌర్జన్య పోకడలను నివారించడం వీలు కావడం లేదు. సాధారణ ఎన్నికలలోనే రిగ్గింగ్ చేయడం మామూలు విషయంగా అలవాటు పడిన ముఖ్యమంత్రి, ఈ ఎన్నికలలో తమ పార్టీ వారిని మాత్రం చూపించి ఓటు వేయమని అడగడంలో విశేషం ఏమి వుందనుకున్నట్లున్నారు. అయితే ప్రతిపక్షము, పత్రికలు తన తప్పులను వెయ్యి కళ్లతో కనిపెట్టే పనిలో వున్నాయన్న నిజాన్ని విస్మరించారాయన. ఆ అలసత్వం ఇప్పుడు ప్రభుత్వాన్ని పెద్ద చిక్కులలో పడవేసింది.

ఎన్నికల కమిషనర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య సత్సంబంధాలు లేవు. ఇప్పటికే ఒకటికి మూడుసార్లు ప్రభుత్వాన్ని అభిశంసించినంత పని చేసింది ఎన్నికల కమిషన్. విశాఖపట్నం శాసనసభ ఉపఎన్నిక అందుకొక ఉదాహరణ. ఆ సందర్భంలోనే ఆ జిల్లా కలెక్టర్ ప్రవీణ్ ప్రకాష్‌ను కూడా బలవంతంగా బదలీ చేయించింది. తమకు సరైన సమాచారం ఇవ్వలేదనే కోపంతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నారాయణ రావును రీకాల్ చేయించింది. విజయనగరం పార్లమెంటు ఉపఎన్నిక సమయంలో కూడా వివాదం తలెత్తింది. ఈ నేపథ్యం వల్లనే ఈ వివాదానికి ఇంత ప్రాధాన్యత వస్తున్నది. లేకుంటే ఇది పెద్ద సమస్య కాదు. చట్టం ప్రకారం బహిరంగ ఓటింగ్ జరిగినట్లు అనుమానం వస్తే, ఆ ఓట్లను రద్దు చేయడం తప్ప, ప్రత్యేక చర్యలంటూ వుండవు. అది పెద్ద సమస్య కాదు. కానీ ఎన్నికల కమిషన్ అంత సరళమైన చర్యలతో ఆగుతుందా లేక ఎన్నికనే రద్దు చేసి రీపోలింగ్ జరపాలని ఆదేశించడం, బహిరంగ ఓటింగ్‌కు పాల్పడిన మంత్రులు, ఎమ్మెల్యేల మీద కేసులు పెట్టడం వంటి తీవ్ర చర్యలకు పూనుకొంటుందా అన్నది స్పష్టం కావడం లేదు.

నిజానికి తెలుగుదేశం పార్టీ కూడా దీన్ని పెద్ద విషయంగా పరిగణించలేదు. లాంఛన ప్రాయంగా స్థానికంగా మాత్రమే ఫిర్యాదు చేసి సరిపెట్టారు. పోలింగ్ అధికారులుగా వ్యవహరించిన జిల్లా కలెక్టర్లు ఆ ఫిర్యాదులను ప్రక్కన పెట్టి, ఎన్నిక సాఫీగా జరిగిపోయిందని నివేదికలిచ్చారు. అయితే రాష్ట్ర ఎన్నికల కమిషనర్ భాస్కర్ తనంతట తానుగా ఒక నివేదిక తయారు చేసి కేంద్రానికి పంపారు. అందులో బహిరంగ ఓటింగ్ ఆరోపణలను, డబ్బు పంపకాన్ని ఎత్తి చూపారు. గతంలో నారాయణరావు వలె తనకు చేదు అనుభవాలు ఎదురు కాకుండా ముందు జాగ్రత్త పడ్డారాయన. ఆయన నివేదిక సమస్తం టీవి వార్తల ఆధారంగా తయారు కావడం గమనించవలసిన అంశం. ఒక్క కలెక్టర్ కూడా వాటిని ధృవీకరించలేదు. ఇప్పుడు ఉన్నత స్థాయి దర్యాప్తు నడుస్తున్నది. ఇందులో ఏ జిల్లాలోనైనా బహిరంగ ఓటింగ్ జరిగిందన్న అంచనాకు కేంద్ర ఎన్నికల కమిషన్ వస్తే మాత్రం, ఆయన జిల్లాల కలెక్టర్లు ఇబ్బందులలో పడతారు. ఎన్నికలు సక్రమంగా నిర్వహించడంలో వైఫల్యం చెందడమే కాక, నిజాలను దాచి పెట్టిన నేరానికి కూడా వారు సమాధానం చెప్పవలసి వస్తుంది.

ప్రతిపక్షం, పత్రికలు తనలో తప్పు వెతకడానికి కాగడాలు వేసి మరీ గాలిస్తున్నప్పుడు, అందుకు తగిన జాగ్రత్తలో వుండడం ముఖ్యమంత్రి చేయవలసిన పని. కానీ ఆయన ఏ మాత్రం లెక్కలేని రీతిలో మొండిగా నడుస్తున్నాడు. కోర్టులు, ఎన్నికల కమిషన్లు, పత్రికలు, ప్రతిపక్షం, ప్రజాస్వామ్య సాంప్రదాయాలు, అధికార నియమాలలో దేనినీ లెక్కపెట్టడం లేదు. తాను అనుకున్నది చేయడం, ఎవరేమి అన్నా పట్టించుకోక పోవడం ఆయన శైలిగా మారింది. దానివల్ల ఎదురయ్యే పరిణామాలనూ తేలికగా తీసి పారేస్తున్నారు. తనను ఎవరూ ఏమీ చేయలేరన్నది ఆయన ధైర్యం. ఇప్పటి సమస్య పట్ల కూడా అదే ధోరణిలో వున్నారాయన. మొండి వాడిని భగవంతుడు కూడా ఏమీ చేయలేడని సామెత; ఎన్నికల కమిషన్ అంటే భగవంతుడి కంటే ఎక్కువేమీ కాదు కదా?



వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగిన ఉగాది వేడుకల్లో ట్రస్ట్ ఐదవ వార్షికోత్సవ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సినీ నటుడు అక్కినేని నాగార్జున. ప్రక్కన మాజీ ఎమ్పీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్, బిజెపి జాతీయ నేత వెంకయ్యనాయుడు, అవధాని పద్మాకర్, స్వర్ణభారత్ ట్రస్టీలు కృష్ణప్రసాద్, దీపావెంకట్.

## గోళ్లు గిల్లుకుంటున్న సలహాదార్లు

వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి హోదాలో నియమించిన ప్రభుత్వ సలహాదారులందరూ పనీ పాట లేక గోళ్లు గిల్లుకుంటూ కూర్చోవలసిన దుర్గతి పడుతున్నది. తనంటే అభిమానించే వారిని తనతో పాటుగా ప్రభుత్వంలో భాగస్వాములను చేయడానికి సలహాదారుల పదవులు సృష్టించారాయన. కెవిపి రామచంద్రరావు, సిసి రెడ్డి, సోమయాజులు, పీటర్ వంటి వారంతా ఈ గౌరవం అందుకున్నారు. సలహాదారు పదవికి మంత్రిత్వ హోదా వుంది. సెక్రటరియేట్‌లో మంత్రులతో సమానంగా పేషీ ఇచ్చారు. జీతభత్యాలు, నౌకర్లు, కార్లు ఇచ్చారు. కానీ వారికి పని మాత్రం చెప్పలేదు. కెవిపి రామచంద్రరావు ఒక్కడే ఇందుకు మినహాయింపు. ఆయన మీద అటు పార్టీ, ఇటు ప్రభుత్వం, మధ్యలో ముఖ్యమంత్రి వ్యక్తిగత లావాదేవీల వ్యవహారాలన్నీ చక్కబెట్టే బాధ్యతలు వున్నాయి. ఒక రకంగా తలకు మించిన భారం అది. తతిమా వారు మాత్రం ఏ పని చేయాలో అర్థం కాక, ఏమీ చేయకుండా వూరకే సెక్రటరియేట్‌కు వచ్చి ఎగతాళి పాలు కావడం ఇష్టం లేక, అట్లని పదవికి రాజీనామా చేయడానికి సాహసించలేక సతమతమై పోతున్నారు. ఈ విషయంలో

తరువాయి 14వ పేజీలో

## బాబు నుంచి రోజూ ఫోన్లే!

తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు నుంచి దాదాపుగా ప్రతి రోజూ ఏదో ఒక మిషతో తమ కార్యాలయానికి ఫోన్లు వస్తుండడం సిపిఎం నేతలకు బాగా సంకటంగా తయారయ్యింది. గత ఎన్నికలలో ఆగర్భ శత్రువుల వలె వ్యవహరించిన పార్టీలివి. చంద్రబాబు అనుసరించిన ప్రపంచ బ్యాంక్ అనుకూల విధానాలతో విభేదించి, కాంగ్రెస్‌తో చెలిమి కట్టారు మార్కిస్టులు. అయితే ఇప్పుడు కాంగ్రెస్‌కు వారికి మధ్య ఉప్పులో నిప్పుగా వుంది. పోలవరంతో మొదలైన రగడ, వ్యక్తిగత స్పర్థ స్థాయికి పెరిగి పోయింది. ఈ పరిణామాన్ని తనకు అనుకూలంగా మలచుకోవాలన్నది చంద్రబాబు తాపత్రయం. కాంగ్రెస్‌తో వారు మళ్లీ కలవకుండా చూసుకోవడంతో పాటు, తనతో దగ్గరయ్యేటట్లు చేసుకోవాలన్నది ఆశ. రేపటి ఎన్నికలలో సిపిఎంతో కల్సి పోటీ చేయాలనే వ్యూహంతో వున్నారాయన. మొదట మొదట సిపిఎం కార్యదర్శి బి.వి.రాఘవులు ఆయన ప్రయత్నాలను కఠినంగా నిరోధించారు. ఆర్టీసి సమ్మె విషయంలో తమతో కల్సి పని చేయడానికి ముందుకు వచ్చిన చంద్రబాబు ఆహ్వానాన్ని తిరస్కరించడమే కాకుండా; ఆర్టీసి ఈ గతి పట్టడా

తరువాయి 14వ పేజీలో

రూ. కోటి విలువ చేసే ప్రభుత్వ స్థలం

# కాకుటూరులో దర్జా కబ్జా!

అధికారుల ఉదాసీనత, రాజకీయ నాయకుల అండదండలుంటే ప్రభుత్వ భూములను సులభంగా ఆక్రమించుకోవచ్చు. కొద్దికాలం గడిచిన తర్వాత ఆక్రమించిన భూములను విక్రయించి కోటీశ్వరులు కావచ్చు. ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే చాలు వాటిని ఆక్రమించడానికి ల్యాండ్ మాఫియా నాయకులు సిద్ధంగా వుంటారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించే సమయంలో అడ్డు చెప్పిన అధికారులను భయపెట్టడం, బెదరించడం, లంచం ఆశ చూపి లొంగదీసుకోవడం ల్యాండ్ మాఫియా నాయకులకు వెన్నతో పెట్టిన విద్య.

వెంకటాచలం మండలం కాకుటూరు పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి ప్రక్కనున్న సర్వే నెంబరు 16లో 67 సెంట్లు, 20లో 1.09 సెంట్లు ప్రభుత్వ భూమి వుంది. ఈ భూమిని కాకుటూరు ప్రజల అవసరం నిమిత్తం కోనేరు ఏర్పాటు కోసం కేటాయించినట్లు రెవెన్యూ రికార్డులలో వ్రాసి వున్నారు. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం ఈ ఎకరా 76 సెంట్లు; కోటి రూపాయలు పలుకుతుంది.

తోటపల్లి గూడూరుకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కోనేరుకు కేటాయించిన ఈ భూమిని ఆక్రమించి చుట్టూ రెండు అడుగుల ఎత్తున ప్రహరీ గోడను నిర్మించాడు. కాకుటూరు దాటిన తర్వాత జాతీయ రహదారికి తూర్పు వైపున వున్న ఈ భూమి చుట్టూ ప్రహరీగోడ నిర్మించి వుండడాన్ని ఈ దారిన వెళ్లే అధికారులు, రాజకీయ నాయకులు చూస్తూనే వుంటారు. ప్రహరీగోడ నిర్మించి వున్న భూములు ప్రభుత్వానికి సంబంధించినవన్న సంగతి అధికారులు గుర్తించక పోవడం బాధాకరం. జాతీయ రహదారి ప్రక్కనున్న ఈ



నెల్లూరు నగరానికి కూత వేటు దూరంలో జాతీయ రహదారి ప్రక్కన విలువైన ప్రభుత్వ స్థలం ఎకరా 76 సెంట్లు ఆక్రమణకు గురైతే పట్టించుకొనే ప్రభుత్వాధికారి లేకపోవడం శోచనీయం.



భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించడంలో కాకుటూరు గ్రామ కార్యదర్శి విజయశ్రీ కీలకపాత్ర వహించారు. ఈ కోనేరుకు కేటాయించిన భూమిని ఆక్రమించి ఐదు నెలలయ్యింది. ఈ భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి ఆక్రమించిన వ్యక్తి పేరు నమోదు చేసేందుకు కూడా రంగం సిద్ధమయ్యింది. రికార్డులను తనకు అనుకూలంగా తయారు చేయించుకునేందుకు అప్పటి రెవెన్యూ అధికారులు, గ్రామ కార్యదర్శికి ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారి 5 లక్షల రూపాయలు నజరానాగా చెల్లించినట్లు వినికిడి.

రికార్డులను తారుమారు చేసే క్రమంలో ప్రభుత్వం రెవెన్యూ అధికారి (వీఆర్ఓ)ని నియమించడం, ఎమ్మార్వోను

తరువ 14వ పేజీలో

# సండేమార్కెట్‌లో రైతు కూలీ రౌడీయిజం

నెల్లూరు నడిబొడ్డులోని సండే మార్కెట్‌లో రైతుకూలీ సంఘం హవా నడుస్తుంది. ఈ సంఘం నాయకుని దౌర్జన్యాలు ప్రశ్నించిన వారికి మార్కెట్‌లో నిలువ నీడ లేకుండా పోతూంది. సండే మార్కెట్‌కు ఎంతో ప్రాముఖ్యత వుంది. తొలుత జిల్లా ప్రజలకు ఎలక్ట్రానిక్ వస్తువులు, వాచీలు, రెడీమేడ్ గార్మెంట్స్ సండే మార్కెట్‌లోనే లభించేవి. మద్రాస్‌కు చెందిన తమిళులు సండే మార్కెట్‌లో వ్యాపారాలు నిర్వహించేవారు.

1980 సంవత్సరంలో ఏర్పాటైన ఈ మార్కెట్ ప్రతి ఆదివారం వినియోగదారులతో కిటకిటలాడేది. రాజీవ్ గాంధీ హత్యానంతరం చెలరేగిన హింసాకాండలో సండే మార్కెట్ పూర్తిగా అగ్నికి ఆహుతయ్యింది. సండే మార్కెట్‌ను పునఃప్రారంభించేందుకు జరిగిన ప్రయత్నాలలో జనశక్తి గ్రూపుకు అనుబంధంగా వున్న రైతుకూలీ సంఘం నాయకులు అండగా నిలిచారు. వివిధ బ్యాంకుల సహకారంతో సండే మార్కెట్‌కు రోడ్డు మార్జిన్ వ్యాపారుల సంక్షేమ సంఘంగా రిజిష్టర్ చేశారు. ఈ సంఘానికి ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం నాయకుడు కిషోర్‌బాబు కార్యదర్శిగా వ్యవహరిస్తున్నాడు.

ప్రస్తుతం సండే మార్కెట్‌లో 99 షాపులున్నాయి. వీటిలో రెడీమేడ్ బట్టలు, ఎలక్ట్రానిక్స్, చెప్పులు,, బ్యాగుల విక్రయాలు జరుగుతున్నాయి. అయితే ఇంతవరకు బాగానే వున్నా ఇక్కడ వ్యాపారాలు నిర్వహించే వారి నుంచి



జనంతో కిటకిటలాడుతున్న సండే మార్కెట్

సంఘం పేరిట ప్రతినెలా చందాల రూపంలో రెండు వందల రూపాయలు లెక్కన వసూలు చేస్తున్నారు. అలాగే మార్కెట్‌లో ఏదైనా షాపును ఇతరులకు అద్దెకు ఇవ్వాలన్నా, విక్రయించాలన్నా కిషోర్‌బాబు జోక్యం తప్పనిసరిగా వుంటుంది. షాపును బాడుగకు తీసుకొనేవారు, ఇచ్చేవారు తప్పనిసరిగా యూనియన్ నాయకులకు గుడ్‌విల్‌గా కొంత మొత్తం ముట్టజెప్పాలి. అంతేకాకుండా రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఏదైనా కార్యక్రమాలు నిర్వహించాలన్నా కూడా వ్యాపారులు విరాళాలు విధిగా అందజేయాల్సిందే.

వ్యాపారుల నుంచి వసూలు చేస్తున్న చందాల నగదుకు సంబంధించిన లెక్కలు కూడా వ్యాపారులకు చూపడం లేదు. రైతు కూలీ సంఘం కార్యకలాపాలు జిల్లాలో లేనప్పటికి సండే మార్కెట్‌ను అడ్డం పెట్టుకుని ఈ సంఘం నేతలు తమ హవా కొనసాగిస్తున్నారు.

కిషోర్‌బాబు, ఆయన అనుచరులు అడిగినప్పుడల్లా విరాళాలు ఇవ్వలేక, వారి ఆగడాలు భరించలేక కొందరు షాపులను ఇతరులకు అద్దెకివ్వగా, మరికొందరు విక్రయం కూడా చేశారు. ఇక్కడ ఎక్కువ మంది వ్యాపారులు తమిళులు కావడం వల్ల కిషోర్‌బాబు చర్యలను నిలదీయలేక పోతున్నారు. దీంతో తమను అడిగేవారు లేరనే భావంతో వీరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సండే మార్కెట్‌లో కిషోర్‌బాబు, అనుచరులు చేస్తున్న ఆగడాల గురించి నోరు మెదపడానికి కూడా మార్కెట్ వ్యాపారులు భయపడుతున్నారు. ఇదిలా వుండగా వేదాయపాళెం సమీపంలో నున్న జనశక్తినగర్‌లోని ఇంటి స్థలాల వ్యవహారంలోనూ కిషోర్‌బాబుపై పలు ఆరోపణలు వున్నాయి. ఇక్కడ కేటాయించిన ఇళ్ల ప్లాట్లు కిషోర్‌బాబు స్వాధీనంలో ఇప్పటికే వున్నాయి. ఇక్కడ నివసిస్తున్న ప్రజలను కూడా రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఏదైనా ధర్నా, ర్యాలీలు నిర్వహించినప్పుడు తప్పనిసరిగా హాజరు కావాలని ఒత్తిడి తెస్తున్నాడట. సమావేశాలకు రాకుంటే ఇళ్ల ప్లాట్లు ఖాళీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వీరి ఆగడాలను భరించలేని పలువురు ఇళ్లను ఎంతో కొంతకు అమ్మేసుకుని వేరే ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు.

పీడిత, తాడిత ప్రజలకు అండగా వుండాల్సిన రైతు కూలీ సంఘం, సండే మార్కెట్ వ్యాపారుల పట్ల పీడగా మారిందనేది వాస్తవం.

## శాసనమండలి ఎన్నిక

3వ పేజీ కొరవ

చేశారు. శేషారెడ్డి వంటి సామాన్య రాజకీయవాది సైతం డబ్బుతో ఓట్లు కొనుగోలు చేయవల్సి రావడం కంటే దయనీయ పరిస్థితి వేరొకటి వుండదు. కానీ ఎమ్మెల్యేలందరూ నిర్దాక్షిణ్యంగా తమ కోటా ఎంతో చెప్పి మరీ దండుక పోయారు. వందల కోట్లకు అధిపతి అయిన మేకపాటి చంద్రశేఖరరెడ్డి ఎమ్మెల్యేగా వుండే ఉదయగిరిలో కూడా డబ్బు సంచుల పంపక భారం శేషారెడ్డి మీద పడిన తర్వాత, తతిమా వారిని అనుకుని లాభం ఏమి వుంది? అంత సొమ్ము తిన్న తర్వాత కూడా ఓటు వేరొకరికి వేయించడం మాత్రం మరీ నీచమైన విషయం. సిరి గల వారు ఏమి చేసినా చెల్లిపోతుందేమో. ఆనం సోదరులు మాత్రం కొంత వరకు తమ బెట్టు నిలుపుకున్నారు. తమ చేతితో చిల్లి గవ్వ తాకక పోవడమే కాదు, తమ నియోజకవర్గాలలో ఒక్క రూపాయి పంచకుండా ఎన్నిక జరిపించారు. అంత వరకు మెచ్చుకోవచ్చు వారిని. కుబేరులుగా చలామణి అయ్యే వారికి వారిని చూసిన తర్వాత అయినా సిగ్గు కల్గడం లేదా?

రాజకీయ మోసానికి మరొక గొప్ప ఉదాహరణగా కూడా ఉపయోగ పడింది ఈ ఎన్నిక. ఆత్మకూరు శాసన సభ్యుడు కొమ్మి లక్ష్మయ్య నాయుడు అందుకు కారకుడు. చివరి క్షణం వరకు తన మద్దతు సి.వి.శేషారెడ్డికే అని చెప్తూ వచ్చారాయన. ముఖ్యమంత్రి, నేదురుమల్లి జనార్దనరెడ్డికి మాట ఇచ్చాడు. శేషారెడ్డి వద్ద ప్రమాణం చేసి చెప్పాడు. జెసి దివాకర్‌రెడ్డిని తన గ్రామం తీసుక వెళ్లి, ఓటర్లతో సమావేశం జరిపాడు. పోలింగ్ మొదలయ్యే సమయానికి శేషారెడ్డిని తన వద్దకు పిలిపించుకుని, నీ వెంటే నేను అన్నట్లు నటించాడు. కానీ మరొక ప్రక్క పోలింగ్ బూత్‌లకు వెళ్లిన తన వారందరికీ వ్యతిరేకంగా ఓటు వేయమని చెప్పి పంపించాడు.

కొమ్మి లక్ష్మయ్య నాయుడు స్వతంత్ర ఎమ్మెల్యే. ఆయనకు కాంగ్రెస్‌తో మొగమాటాలు లేవు. ఈ ఎన్నికలో కాంగ్రెస్‌కు చేయడం తనకు ఇష్టం లేనప్పుడు, తిరుగుబాటు అభ్యర్థితో తనకు మొగమాటం వున్నప్పుడు, ఆ సంగతి స్పష్టంగా చెప్తే ఆయన్ను కొట్టే వారు లేరు; తిట్టే వారూ లేరు. కానీ మీ పక్షే నేను అని నమ్మించి, ఓట్లను మాత్రం మరొక ప్రక్కకు తరలించే మోసానికి ఎందుకు పాల్పడ్డాడో అర్థం కాని విషయం. లక్ష్మయ్య నాయుడు వ్యక్తిత్వానికి మచ్చ తెచ్చే పరిణామం ఇది.

తిరుగుబాటు అభ్యర్థి బి.రాఘవేంద్ర రెడ్డికి కూడా తెలుగు దేశం నుంచి అక్కడక్కడా ఇటువంటి పరిస్థితే ఎదురైనట్లు కన్పిస్తున్నది. ఆయన వద్ద కూడా ఆ పార్టీ నేతలు దండిగా డబ్బు దండుకున్నారు. కోట్లు ఖర్చు పెట్టించారు. సొమ్ము తినడంలోని ఆ చిత్త శుద్ధి పోలింగ్ వద్ద మాత్రం చూపలేదు.

మొత్తం మీద రెండు పార్టీలలో, ఇద్దరు అభ్యర్థులకు చేదు అనుభవాలు ఎదురైనాయి ఈ ఎన్నికలో. రెండు పార్టీలలోనూ క్రాస్ ఓటింగ్ స్వేచ్ఛగా నడిచింది. కొందరు ఓటర్లు ఇద్దరు అభ్యర్థుల దగ్గర డబ్బు తీసుకున్నారు. స్వంత పార్టీ అయితే ఓటుకు ఇరవై వేలు; ప్రక్క పార్టీ అయితే ముప్పై నుంచి యాభై వేల వరకు పంపకాలు జరిగాయి. నాయకులకిచ్చింది దీనికి అదనం. రెండు ప్రక్కలా సొమ్ము తిన్నవాడు ఎవరికి ఓటు వేశాడో వూహించి చెప్పడం ఎవరి తరం. అందువల్ల ఓట్ల లెక్కింపు జరిగే వరకు గెలుపు ఓటముల అంచనాకు పూనుకోక పోవడం ఉత్తమం.

పట్టభద్రుల స్థానం విషయంలో కూడా విజయావకాశాలు ఎవరివి అన్న ఊహ చేయడం అసాధ్యంగా కన్పిస్తుంది. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క అభ్యర్థి మెరుగుగా కన్పిస్తున్నాడు. ఇక్కడ ఎంతో అత్యధికంగా కన్పించే అభ్యర్థి ప్రక్క వూరికి వెళ్తే అసలు కన్పించడమే లేదు. సిపిఎం బలపరిచిన వి.బాలసుబ్రహ్మణ్యం మాత్రం ఎన్నికల యంత్రాంగంలో అందరికంటే మిన్నగా కన్పించాడు. దానివల్ల ఓట్లు వస్తాయా లేదా అన్నది తెలియదు. టీచర్ల విషయంలో మాత్రం యుటిఎఫ్ అభ్యర్థి రామిరెడ్డి గెలవవచ్చునని ఒక అంచనా.



నెల్లూరు కార్పొరేషన్ ఆఫీసు వద్ద తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లతో ముచ్చటిస్తున్న స్థానిక సంస్థల స్థానానికి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన బి.రాఘవేంద్రరెడ్డి.

**జమీన్‌రైతు**
పొగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190

**చందా**
సంవత్సరానికి రూ.200లు
విదేశాలకు రూ.1000లు

## పందికొక్కులు

11వ పేజీ కొరవ

చూపిస్తున్న శ్రద్ధను తన విధుల పట్ల చూపించడం లేదు. దీంతో నాసిరకం బియ్యం కొనుగోళ్లు భారీగానే జరుగుతున్నాయి.

భారత ఆహార సంస్థ అధికారుల పనితీరును పర్యవేక్షించేందుకు జిల్లాలో ఏ స్థాయి అధికారి లేకపోవడంతో ఇక్కడ అధికారులు, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల కోసం విడుదల చేస్తున్న నిధులను దుర్వినియోగం చేస్తున్నారు. జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు భారత ఆహార సంస్థ ఆధ్వర్యంలో కాకుటూరు, బుచ్చి, నెల్లూరు, గూడూరు, వేదాయపాళెం, నార్తురాజుపాళెం, పంచేడు ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర రైతులకు లాభదాయకంగా లేకపోవడంతో ఈ కొనుగోలు కేంద్రాలకు తాము పండించిన ధాన్యాన్ని ఏ రైతు తీసుకురావడం లేదు.

1010, ఎన్ఎల్ఆర్ 9675, సన్నాలు, 9672 లావులు, సిఆర్ 1009, బుడ్డలు, తదితర రకాలు బయట మార్కెట్‌లో పుట్టి 6వేల రూపాయల ధర పలుకుతుంది. భారత ఆహార సంస్థ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఈ రకాలకు పుట్టికి ఐదువేల రూపాయలు గిట్టుబాటు ధరగా నిర్ణయించారు. దీంతో రైతులు తాము పండించిన ధాన్యాన్ని బయట విక్రయించుకుంటున్నారు. భారత ఆహార సంస్థ జిల్లా కార్యాలయం, గోడౌన్లలో భారీ ఎత్తున జరుగుతున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం, నిఘా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## దర్గా కబ్జా

7వ పేజీ కొరవ

బదలీ చేయడంతో ఈ తతంగం తాత్కాలికంగా ఆగింది. కొత్తగా నియమితులైన విఆర్ఓ, బదలీపై వచ్చిన ఎమ్మార్వోను బుట్టలో వేసుకునేందుకు భూబకాసురుడు మళ్లీ రాజకీయ పైరవీలు మొదలు పెట్టినట్లు తెలిసింది. కోటి రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమి అప్పనంగా రియల్ ఎస్టేట్ వ్యాపారుల పరం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత జిల్లా వున్నతాధికారులపై వుంది.

## రోజూ ఫోన్లే

మొదటి పేజీ కొరవ

నికి నువ్వే కారకుడివి అని బహిరంగ వ్యాఖ్య కూడా చేశాడు. కానీ రాఘవులులో ఇప్పుడా కోపం లేదు. దాన్ని చంద్రబాబు బాగా గ్రహించాడు. అసెంబ్లీ సమావేశాలలో చర్చకు వచ్చే విషయాలు, సమస్యలు, వివాదాల పేరుతో దాదాపుగా ప్రతి రోజు సిపిఎం ఆఫీసుకు ఫోన్ చేస్తున్నారు. రాఘవులు అందుబాటులో వుంటే ఆయనతోనే మాట్లాడుతున్నారు. లేకుంటే తమ్మినేని వీరభద్రం, నోముల నర్సింహయ్యలతో చర్చలు జరుపుతున్నారు. తెలుగుదేశం నేత నుంచి ఇంత తరచుగా ఫోన్లు రావడాన్ని చూసిన వారూ ఏమంటారోనని సంకట పడుతున్నారు మార్క్సిస్ట్ నేతలు.



శాసన మండలి ఎన్నికను పురస్కరించుకొని నెల్లూరు కార్పొరేషన్ ఆఫీసులో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌కు ఓటేయను వెళ్తున్న వివేకానందరెడ్డి, పులిమి శైలజ, ఆదాల ప్రభాకరరెడ్డి, కార్పొరేటర్లు.

## సలహాదార్లు

మొదటి పేజీ కొరవ

సిసి రెడ్డిది మరీ జాలి గొలిపే పరిస్థితి. సలహాదారు పదవితో వచ్చే జీతం కానీ, హోదా కానీ అవసరం లేనీ వారాయన. వందల కోట్ల వ్యాపారాలున్నాయి. ఆఫ్రికా ఖండంలో కూడా పరిశ్రమలున్నాయి. కేవలం ముఖ్యమంత్రి మీద అభిమానంతో ప్రభుత్వంలో పాలు పంచుకోవాలని తాపత్రయ పడ్డారు. కానీ పదవి తప్ప పని లేకుండా చేయడం ఆయన మనసుకు కష్టం కల్గిస్తున్నది. ఆ మాట బయటకు చెప్పుకోలేదు; సర్దుకుని వుండనూ లేదు. కక్క లేక మ్రింగ లేక అన్నట్లుంది ఆయన పరిస్థితి.

## ప్యాడ్స్‌లో ఎన్ని రకాలో

8వ పేజీ కొరవ

తయారైన ప్యాడ్‌లు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. ముఖ్యంగా పిల్లలను ఆకర్షించేలా అట్టలపై వివిధ జంతువుల బొమ్మలను ముద్రిస్తున్నారు. వివిధ రకాల స్కూటర్లు, బైక్‌లు, కార్లు, విమానాల బొమ్మలు, క్రికెటర్ల ఫొటోలు ముద్రించినవి, దేవుని బొమ్మలు, పూలు, వివిధ డిజైన్లలో పిల్లలను ఆకట్టుకొనేలా వుండే ప్యాడ్‌లు నెల్లూరులో న్యూ వెంకట్రామా అండ్‌కో దొరుకుతున్నాయి. ప్లాస్టిక్, పివిసి, ల్యామినేటెడ్ ప్యాడ్‌లు పదిహేను రూపాయల నుంచి నూట యాభై రూపాయల వరకు ధర పలుకుతున్నాయి. ఈ ప్యాడ్‌లలోనే స్కేలును డిజైన్ చేసి వుండడంతో ప్రత్యేకంగా స్కేలు ఉపయోగించనవసరం లేకుండా, ప్యాడ్‌లపై వుండే స్కేలునే వినియోగించుకోవచ్చు. ఇటువంటి సౌకర్యాలుండే ప్యాడ్‌లను కొనుగోలు చేయను ఎక్కువ మంది విద్యార్థులు మక్కువ చూపుతున్నారు.

## సచిత్ర గీతిక

8వ పేజీ కొరవ

దేవుని బొమ్మలైనా, ప్రకృతి అందాలైనా, సమాజంలోని పరిస్థితులను ప్రతిబింబించే బొమ్మలైనా అవలీలగా గీస్తున్న సౌపర్ణిక ఇంజినీరింగ్ చేసి గొప్ప పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవడమే తన ధ్యేయమంటుంది. చిత్రాలను గీయడంతో పాటు ఇంటీరియర్ డెకరేషన్ లోనూ తనదైన రీతిలో ప్రతిభను ప్రదర్శిస్తున్న సౌపర్ణిక తల్లి భారతి గృహిణి కాగా, తండ్రి శంకర్‌రెడ్డి వ్యాపారి. వేదవ్యాస స్కూలు యాజమాన్యం తనను చిత్రలేఖనంలో ప్రోత్సహించి పలు బహుమతులు పొందేందుకు కారకులయ్యారని సౌపర్ణిక కృతజ్ఞతలు తెలిపింది.

## ఆకలి కేకలు

13వ పేజీ కొరవ

టించారు. నిర్వాహకులను భోజనం గురించి ప్రశ్నిస్తే మీకు వసతి ఏర్పాటు చేసిన చోటే భోజన సదుపాయం కల్పించామని అక్కడకు వెళ్లి తినాల్సిందేనని చెప్పడంతో బాడీబిల్డర్లు విస్తుపోయారు. వీరికి వసతి ఏర్పాట్లు చేసిన చోటకు, పోటీలు జరిగే ప్రదేశానికి చాలాదూరం వుండడంతో కండలవీరులు ఆకలి బాధ తీర్చుకొనేందుకు ఎండలో పరుగులు పెట్టాల్సి వచ్చిరది. నగర వీధుల్లో ఒక్కసారిగా అంతమంది కండలవీరులు వడివడిగా వెళ్లడం చూసి జనం ఆశ్చర్యపోయారు. అసలు విషయం తెలుసుకొని నోరెళ్లబెట్టారు.

## ఎలక్ట్రిక్ స్కూటర్లు

9వ పేజీ కొరవ

పెట్రోలుతో అవసరమే వుండక పోవడంతో ఎలక్ట్రిక్ బైక్‌లను జనం ఇష్టపడుతున్నట్లు షోరూం నిర్వాహకులు చెబుతున్నారు. ముప్పయి రెండువేల రూపాయల విలువ చేసే ఎలక్ట్రిక్ బైక్‌లు ఆరు రంగుల్లో లభ్యమవుతున్నాయి. వాహనాల కొనుగోలుకు వివిధ బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తుండడంతో పాటు, సులభంగా ఎవరైనా నడిపే విధంగా వుండడంతో ఎలక్ట్రిక్ బైక్‌లు ఎక్కువ మంది వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి.

## మార్కెట్ మాఫియా

5వ పేజీ కొరవ

తలు, విజిలెన్స్ శాఖాధికారులు దాడులు చేయకుండా రెండు శాఖలకు చెరో లక్షా మార్కెట్ రౌడీలు నెలనెలా సమర్పిస్తుంటారు. దీనికిగాను ప్రతి రోజూ ప్రతిషాపు వద్ద నుంచి మామూళ్లు వసూలు చేస్తారు. లంచాలకు అలవాటుపడ్డ తూనికలు - కొలతలు; విజిలెన్స్ శాఖలు, పోలీసుల దాడి తర్వాత తూతూ మంత్రపు దాడి జరిపి తామున్నామనిపించారు. మార్కెట్‌లో ప్రస్తుతమున్న తప్పుడు వ్యాపారస్తులందరినీ తరిమిగొట్టి కొత్తగా షాపులు వేలం వేస్తేగాని మార్కెట్‌లో అవినీతి అంతం కాదు. కాని ఆ పని చేసే అపరిచితుడేది?

# ముఖ్యమంత్రి పలుకుబడి తగ్గుతుందా?

కాంగ్రెస్ అధిష్టానం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాభవం తగ్గుముఖం పడుతున్నదన్న ప్రచారం కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో విస్తృతంగా జరుగుతున్నది. మామూలు పరిస్థితులలో అయితే ఏ కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా ముఖ్యమంత్రి మీద వచ్చే పుకార్లు, ప్రచారాలను అక్కడికక్కడే తిప్పికొడుతుంటారు. ఆయన మీద మాట పడకుండా చూస్తుంటారు. కానీ మంత్రి పదవులు ఇక ఎప్పటికీ రావన్న అనుమానంతో వ్యధ చెందుతున్నవారు, చిరాకు పడుతున్నవారు మాత్రం ముఖ్య



మంత్రి మీద నిష్ఠూరపడేందుకు ఏ చిన్న అవకాశం వచ్చినా వదలి పెట్టడం లేదు. అసెంబ్లీ సమావేశాలు నడుస్తుండడంతో ఇటువంటి చర్చలకు ఆస్కారం ఏర్పడుతున్నది. అధిష్టానం ధోరణి మారిందన్న అనుమానానికి వీరు చూపుతున్న ఉదాహరణ - శాసన మండలి ఎన్నికల అభ్యర్థిత్వాల ఎంపిక. మొదటి దశలో జరిగిన స్థానికసంస్థల స్థానాలకు మాత్రం వైఎస్ పూర్తిగా తన అనుచరులను మాత్రమే ఎంపిక చేయించారన్నది నిజం. అధిష్టానం ఆయనకు సంపూర్ణ స్వేచ్ఛ కల్పించింది. అయితే ఆ తర్వాత జరిగిన ఎమ్మెల్యే నియోజకవర్గ అభ్యర్థుల విషయంలో మాత్రం ముఖ్యమంత్రి మాట ఎంత మాత్రం చలామణీ కాలేదు. ఆయన చెప్పిన పేర్లను ప్రక్కన పెట్టి, తనవారికి టిక్కెట్లు ఇప్పించగలిగాడు పిసిసి అధ్యక్షుడు కె.కేశవరావు. వైఎస్ నిలబెట్టిన బొమ్మ వలె పిసిసిని నిర్వహిస్తున్న కెకెకు ఒక్కసారిగా అంత ప్రాధాన్యత దక్కడం విశేషం. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికకు అధిష్టానం కొన్ని మార్గదర్శకాలు నిర్దేశించింది. ఇతరత్రా పదవులు పొందిన వారికి, గత ఎన్నికలలో ఓడిపోయిన వారికి టిక్కెట్లు ఇవ్వరాదన్నది వాటిలో కొన్ని. అయితే కార్పొరేషన్ ఛైర్మన్‌గా వున్న గిడుగు రుద్రరాజుకు, గత ఎన్నికలలో ఓటమి చవిచూసిన పుట్టా నరసింహారెడ్డికి టిక్కెట్లు ఇచ్చారాయన. తమ మాట ధిక్కరించాడన్న అభిప్రాయాన్ని కల్గించాయి ఆ ఎంపికలు. దాని వల్లనే కాబోలు తదుపరి ఎంపికలో ఆయన్ను ప్రక్కన పెట్టారు. ఇప్పుడు తాజాగా నడుస్తున్న నామినేషన్ కోటాలోని 12 స్థానాలకు కూడా వైఎస్ సూచనలను పెడ చెవిన పెట్టి, ఢిల్లీ పెద్దలే తమకు నచ్చిన వారిని ఎంపిక చేస్తున్నారని చెప్పున్నారు. అదే జరిగితే అధిష్టానానికి, ముఖ్యమంత్రికి మధ్య సంబంధాలు బెడిసి కొట్టినట్లే లెక్క. వచ్చే నెలలో మంత్రివర్గ విస్తరణ జరపక తప్పని పరిస్థితులలో వున్న ముఖ్యమంత్రికి ఇదంత రుచించే విషయం కాదు. ఎమ్మెల్సీలుగా తనకు సంబంధం లేని వారు ఎంపికైనా వచ్చే ఇబ్బంది వుండదు. కానీ మంత్రి పదవుల విషయంలో మాత్రం తనతో ప్రమేయం లేకుండా ఒకరిద్దరు సిఫార్సు చీటీలు తెచ్చుకున్నా ప్రభుత్వం మీద పట్టు తప్పి పోయింది.

**శాసన మండలి అభ్యర్థుల ఎంపికలో వైఎస్ వ్యవహరించిన తీరు కాంగ్రెస్ అధిష్టానానికి కోపం తెప్పించింది. దీంతో నామినేటెడ్ కోటాలోని 12 స్థానాలకు ఢిల్లీ పెద్దలే తమకు నచ్చిన వారిని ఎంపిక చేస్తున్నారని చెప్పున్నారు. అదే జరిగితే అధిష్టానానికి, ముఖ్యమంత్రికి సంబంధాలు బెడసికొట్టినట్లే లెక్క**



ఉగాది పండుగ సందర్భంగా జరిగిన నెల్లూరు గ్రామదేవత ఇరుగాలమ్మ గ్రామోత్సవం.



మహమ్మదాపురం గ్రామంలో పూండ్ల వెంకురెడ్డి చారిటబుల్ ట్రస్ట్, షిర్డి సాయి రూరల్ వెల్ఫేర్ మెడికల్ ఫౌండేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెగా వుచిత వైద్య శిబిరాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఆత్మకూరు ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు, పూండ్ల వెంకురెడ్డి, డాక్టర్లు శ్రీధర్‌రెడ్డి, రాజశేఖర్.


ఏ దేశ మేగినా
ఎంతెత్తు కెదిగినా
జన్మభూమిని
'జమీన్‌రైతు'ను
మరవక పోవడం
నెల్లూరీయుల
సాంప్రదాయం



జమీన్‌రైతు

పాఠకులకు ప్రత్యేక కానుక

NIPPO Radium Torch

డెబ్బయ్ ఎనిమిదేళ్లుగా 'జమీన్‌రైతు'ను తమ అభిమాన పత్రికగా ఆదరిస్తున్న పాఠకులకు ఈ కొత్త సంవత్సరంలో కొంగ్రొత్త కానుకగా నిప్పో రేడియం టార్చ్‌లైట్ అందిస్తున్నాము. 1-1-2007 నుండి 31-3-2007 మధ్య సంవత్సర చందా చెల్లించిన వారందరికీ ఈ కానుక అందుతుంది!

చందా చెల్లించిన వెంటనే రశీదుతో పాటు కానుక అడిగి తీసుకోండి. ఇతర ప్రాంతాల నుంచి ఎం.ఓ. లేదా డి.డి. (చెక్కులు స్వీకరించబడవు) ద్వారా చందా పంపేవారు మా కార్యాలయానికి వచ్చి కానుక స్వీకరించాలి. కానుకను పోస్టులో పంపడం సాధ్యం కాదు.

సంవత్సర చందా రూ.200

జమీన్‌రైతు, వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పొగతోట, నెల్లూరు - 524 001.

సాహసోపేత వార్తా చిత్రిక - జమీన్‌రైతు వారపత్రిక



## సిటీ కేబుల్ సూపర్ తంబోల

జమీన్‌రైతు

జమీన్‌రైతు,
సిటీ కేబుల్
(ఎసిఎన్‌టివి ఛానల్)

సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు ZEM ఛానల్‌లో సూపర్ తంబోల గేమ్ ప్రసారమౌతుంది!

ఫుల్ హౌస్‌కు బహుమతి
కలర్ టివి



మూడు 'రో'లకు మూడు బహుమతులు
'టాప్ రో' విజేతకు సెల్‌ఫోన్
'మిడిల్ రో' విజేతకు ఇన్‌స్టెంట్ వాటర్ హీటర్
'బాటమ్ రో' విజేతకు గిఫ్ట్ ఓచర్

ఈ గేమ్‌లో పాల్గొనడం చాలా సులభం. జమీన్‌రైతు వారపత్రికతో పాటుగా లభించే గేమ్ కూపన్ సేకరించండి. ప్రతి టిక్కెట్‌పైన సీరియల్ నంబరు, గేమ్ ఆడవలసిన తేది వుంటాయి. టివి ఛానల్‌లో యాంకర్ ప్రకటించే నంబర్లను మీ దగ్గరున్న టిక్కెట్‌లోని నంబర్లతో పోల్చుకోవాలి. ఆమె చెప్పిన నంబరు మీ టిక్కెట్‌లో వుంటే - పేనాతో గుర్తు పెట్టండి! ఇట్లా గుర్తు పెట్టిన నంబర్లు ఒక వరుసకు సరిపోతే - ఒక 'రో' పూర్తి అయినట్లు లెక్క; మొత్తం మూడు వరుసలలోని నంబర్లకు సరిపోతే, ఫుల్ హౌస్ గెల్చుకున్నట్లు లెక్క. 'రో' లేదా ఫుల్ హౌస్ పూర్తి కాగానే 2332399 నంబరుకు ఫోన్ చేసి, మీ టిక్కెట్ నంబరు చెప్పాలి. ఎవరు ముందుగా ఫోన్ చేస్తే వారికే బహుమతి. 'రో' లేదా ఫుల్ హౌస్ పూర్తికాక మునుపే ఫోన్ చేస్తే - కంప్యూటర్‌లో ఆ విషయం తెలిసిపోతుంది. తప్పుడు సమాచారం ఇచ్చిన టిక్కెట్లు బహుమతికి అనర్హమౌతాయి. అందువల్ల ఆ పొరపాటు చేయవద్దు. తతిమా వివరాలు టిక్కెట్ వెనుకవైపు వున్నాయి.

జమీన్‌రైతు వార పత్రికలో మాత్రమే టిక్కెట్లు లభిస్తాయి.


Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.